పార్లమెంట్‌లో తెలంగాణ గొంతు వినిపించాలి

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి చాయ్ తాగుతున్న ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ

వీణవంక, మార్చి 27: పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుక వినపడాలంటే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన వివాహ వేడుకకు ఆయన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో మోటర్ వైండింగ్ చేస్తున్న శ్రీనివాస్ వద్దకు వినోద్‌కుమార్ వెళ్లి మాట్లాడారు. గతంలో ఎన్ని మోటర్లు కాలిపోయేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎన్ని మోటర్లు కాలుతూ రిపేర్‌కు వస్తున్నాయని అడిగారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరెంట్ సక్రమంగా ఉండడంతో మోటర్లు బాగున్నాయని, ఇప్పుడు తరచూ కాలిపోయి రిపేర్‌కు వస్తున్నాయని శ్రీనివాస్ చెప్పారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందని, కాంగ్రెస్ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంట్ కోతలకు కాలిపోయిన మోటార్ల లెక్కనే ఆరు గ్యారంటీలు ఉంటాయన్నారు. కేసీఆర్ హయాంలో వ్యవసాయం పండుగలా ఉండేదని, కాంగ్రెస్ వచ్చాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

వివాహ వేడుకకు మాజీ ఎంపీ, ఎమ్మెల్యే హాజరు

మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీగణపతి ఫంక్షన్ హాల్‌లో కల్వల మాజీ సర్పంచ్ దాసారపు భద్రయ్య కూతురు వివాహం జరుగగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలోని ఓ హోటల్‌లో స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి సమోసా తిని, చాయ్ తాగారు. అలాగే, మండల కేంద్రానికి చెందిన గెల్లు శ్రీనివాస్‌కు రోడ్డు ప్రమాదంలో కాలుకు గాయం కాగా, వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎంపీపీలు ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, పావని-వెంకటేశ్, మాజీ సర్పంచులు నీల కుమార్, మోరె సారయ్య, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేకుర్తి కంటి దవాఖానలో లెజియన్ ఫాకో మిషన్ ప్రారంభం

లెజియన్ ఫాకో మిషన్‌ను ప్రారంభిస్తున్న చిన జీయర్ స్వామి

విద్యానగర్, మార్చి 27: రేకుర్తిలోని కంటి దవాఖానలో ఏర్పాటు చేసిన లెజియన్ ఫాకో మిషన్‌ను బుధవారం చిన జీయర్ స్వామి ప్రారంభించారు. దవాఖానలోని పలు విభాగాలను కలియ తిరిగి నిర్వహణ బాగుందని అభినందించారు. కార్యక్రమంలో దవాఖాన చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేశ్, కోశాధికారి బొమ్మ పవన్, ట్రస్ట్ సభ్యులు మురళీధర్ రావు, కోల అన్నా రెడ్డి, రాజిరెడ్డి, వెంకటేశ్వర్ రావు, కోదండ రాములు, మోర భద్రేశం, సుధాకర్ రెడ్డి, దవాఖాన డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

కలెక్టరేట్, మార్చి 27: అధికారులు నిర్లక్ష్యం వీడి నిబద్ధతతో పని చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులపై బుధవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా చేపట్టిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిధులున్నా గడువులోగా పనులు పూర్తి చేయకపోవడంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈనెల 31లోగా పనులు పూర్తి చేయకపోతే నిధులు లాప్స్ అయ్యే అవకాశముందని స్పష్టం చేశారు. రెండు, మూడు రోజుల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. బుధవారం రాత్రిలోగా పెండింగ్ పనుల వివరాలు అందించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న తాగునీటి పనులు సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేకాధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తాగునీటి సరఫరాకు సంబంధించి 210 అత్యవసర పనులు చేపట్టేందుకు పలు గ్రాంట్ల కింద రూ.5.08 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో చేపట్టిన బోర్‌వెల్స్, పంపుసెట్లు, ఇతర అత్యవసర మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ మాట్లాడుతూ, ప్రత్యేకాధికారులు వారంలో మూడు, నాలుగు రోజులు గ్రామాలను సందర్శించాలన్నారు. సమావేశాల్లో డీఆర్డీవో శ్రీధర్, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, డీపీవో రవీందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అంజన్‌రావు, మిషన్ భగీరథ ఈఈ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

శంకరపట్నం, మార్చి 27: కేశవపట్నం గ్రామానికి చెందిన గాజుల నందన్ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీ వినోద్‌కుమార్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ బుధవారం పరామర్శించారు. వారి వెంట జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్, బీఆర్ఎస్ నాయకులు సతీశ్‌రెడ్డి, రవి యాదవ్, హనుమంతు, కోటి, లక్ష్మారెడ్డి, వీరస్వామి, సంజయ్, మన్సూర్, మల్లర్ రావు, శ్రీకాంత్, శ్రీను ఉన్నారు.

సొల్లు బాబు క్షమాపణ చెప్పాలి

హుజూరాబాద్ టౌన్, మార్చి 27: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను మాదిగ ద్రోహులని విమర్శించిన హుజూరాబాద్ కాంగ్రెస్ నాయకుడు సొల్లు బాబు మాదిగ జాతికి క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రుద్రారపు రామచంద్రం మాదిగ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు శ్రీనివాస్‌మాదిగ, వసంత్, మల్లయ్య తదితరులున్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి

హుజూరాబాద్ టౌన్, మార్చి 27: టెట్ ఫీజును తగ్గించాలని బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టెట్ ఫీజు ఒక పరీక్షకు కేవలం రూ.200 మాత్రమే ఉండేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి టెట్ ఫీజు తగ్గించాలని కోరారు. లేని పక్షంలో నిరుద్యోగులతో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

వేసవిలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలి

- చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి, పక్కన అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్

కలెక్టరేట్, మార్చి 27: వేసవిలో అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. వేసవి బారి నుంచి ప్రజలను కాపాడేందుకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి కూలీలు, కార్మికులు ఉదయమే పనులు చేయాలని సూచించారు. జనసంచారం అధికంగా ఉన్నచోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పశువులు, పక్షులు, వన్యప్రాణులు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, విద్యార్థులు వడదెబ్బకు గురికాకుండా అధికారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎవరైనా వడదెబ్బకు గురైతే సత్వరమే చికిత్స అందించి దవాఖానకు తరలించాలని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులకు, ఉపాధి కూలీలకు, గ్రామాల్లో ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. వేసవిలో తాగునీటిని పొదుపుగా వాడాలని ప్రజలకు సూచించారు. జిల్లాలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పైప్‌లైన్ మరమ్మతులు ఉన్నచోట వెంటనే పనులు పూర్తి చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, డీఆర్‌వో పవన్‌కుమార్, డీపీవో రవీందర్, డీఆర్‌డీవో శ్రీధర్, సీపీవో కొమురయ్య, అగ్నిమాపకశాఖ అధికారి వెంకన్న, డీఎంహెచ్‌వో డా.సుజాత, జిల్లా సంక్షేమాధికారి ఎం సరస్వతి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డీఎఫ్‌వో నర్సింగా రావు, హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు, సీఎస్ ఏసీపీ కాశయ్య, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో మీడియా కీలకం

ఎన్నికల నిర్వహణలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెయిడ్ న్యూస్‌ను గుర్తించడంతో పాటు ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు ప్రసారం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్‌వో పవన్‌కుమార్, సమాచార పౌరసంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్‌కుమార్, ఏపీఆర్‌వో వీరాంజనేయులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్వర్మేషన్ ఇంజినీర్ కొండయ్య, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్, డీఐవో శివరాములు, ఉష, శ్రీధర్, రాజ్‌కుమార్, రాంబాబు, చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 1343 పోలింగ్ కేంద్రాలు

- 5,908 మంది సిబ్బంది కేటాయింపు
- పూర్తయిన మొదటి విడుత ర్యాండమైజేషన్

కలెక్టరేట్, మార్చి 27: పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లు జిల్లాలో చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే పోలింగ్ కేంద్రాలు గుర్తించి, వాటిలో అవసరమైన వసతులను జిల్లా ఎన్నికల యంత్రాంగం కల్పించింది. హోం ఓటింగ్ ప్రక్రియకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నది. పలు ప్రభుత్వ శాఖల సిబ్బందిని గుర్తించి, వారికి మొదటి విడుత ర్యాండమైజేషన్ కూడా పూర్తి చేశారు. పీవోలు, ఏపీవోలకు త్వరలో శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మూడు, నాలుగు రోజుల్లో కలెక్టరేట్ ఆడిటోరియంలో శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అలాగే, ఓటింగ్ నిర్వహణ, పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనలతో కూడిన హ్యాండ్ బుక్కుల పంపిణీ ప్రారంభించారు. వీటిని జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల బాధ్యులైన అధికారులకు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో 1,343 పోలింగ్ కేంద్రాలుండగా, 5,908 మంది సిబ్బందిని కేటాయించారు. వీరిలో 1,477 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,477 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 2,954 మంది ఓపీవోలుగా విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ విధుల కోసం నియమించిన సిబ్బందికి ఇప్పటికే ఉత్తర్వులు అందజేయగా, ఫాం-12 కూడా పంపిణీ చేస్తున్నారు. పోలింగ్ సిబ్బందితో పాటు అత్యవసర సేవల్లో విధులు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించనున్నారు. ఇప్పటికే నోడల్ అధికారులు, సిబ్బందికి దీనిపై జిల్లా ఎన్నికల అధికారి అవగాహన కల్పించారు. ఎన్నికల విధులతో పాటు అత్యవసర సేవల విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి తన ఓటు హక్కు వినియోగించుకునేలా ఫాం-12 అందించి దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారు. వీరంతా ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు వచ్చే ఇతర ప్రాంతాల సిబ్బందికి స్పెషల్ క్యాజువల్ సెలవు ఇవ్వనున్నట్లు సమాచారం.

విద్యార్థి మృతదేహం లభ్యం

తిమ్మాపూర్, మార్చి 27: మండలంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్న ఎనగంటి అభిలాష్ (20) ఇటీవల అదృశ్యమయ్యాడు. బుధవారం సాయంత్రం తిమ్మాపూర్ శివారులోని ఎంజేపీ గురుకుల పాఠశాల సమీపంలో గల బావిలో మృతదేహం దొరికింది. ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం మండలానికి చెందిన అభిలాష్ మిస్సింగ్ సమాచారం కుటుంబ సభ్యులకు తెలియడంతో తండ్రి శ్రీనివాస్ ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి పలు చోట్ల గాలించగా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో బుధవారం గురుకుల పాఠశాల సమీపంలోని గవ్వ రవీందర్‌రెడ్డికి చెందిన వ్యవసాయ బావి నుంచి దుర్వాసన వస్తుండడంతో చూడగా మృతదేహం కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, వెళ్లి పరిశీలించి అభిలాష్‌గా గుర్తించారు. కుళ్లిన స్థితిలో ఉండడంతో వైద్యులు ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం చేసి, కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చేరాలు తెలిపారు.

సమస్త తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, FAHIM FATHIMA, W/o. Syed Anwaruddin, R/o. 2-7-579, Mukarampura, Karimnagar, T.S. have Changed My Name as FAHEEM FATHIMA, W/o. Syed Anwaruddin. NT-328852

★I, SHEELAM SAILEKH RAJ, R/o. 10-5-17/1, Kisan Nagar, Karimnagar, T.S. have Changed My Name as SHEELAM VISHWA SAI LEKH RAJ, S/o. Chiranjeevi. NT-328852

★I, ALLADI SHYLEJA, R/o. 3-6-510/1, Subhash Nagar, Karimnagar, T.S. have Changed My Name as ALLADI SHAILAJA, D/o. Alladi Vykuntam. NT-328852

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
నమస్తే తెలంగాణ
4 లైన్లకు 200/-
50/- అదనపు లైన్
3+1
GST 5% వర్తింపబడును
Cell: 91827 77571
91827 77194

పీఎఫ్‌తో ఉద్యోగులకు భద్రత

హుజూరాబాద్‌టౌన్, మార్చి 27: పీఎఫ్‌తో ఉద్యోగులకు భద్రత ఉంటుందని ఈపీఎఫ్ నోడల్ జిల్లా అధికారి ఎన్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. హుజూరాబాద్‌లోని పరకాల క్రాస్ రోడ్ వద్ద గల నాగార్జున డెయిరీలో బుధవారం ఏర్పాటు చేసిన ఈపీఎఫ్‌పై అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వరుసగా పదేళ్లు పీఎఫ్ చెల్లిస్తే వారికి భవిష్యత్‌లో పెన్షన్ కూడా వస్తుందని తెలిపారు. కాగా, నాగార్జున డెయిరీలో కొత్త ఉద్యోగులు పీఎఫ్ చెల్లించడానికి అంగీకరించగా, డెయిరీ చైర్మన్ పుల్లూరి ప్రభాకర్‌రావుతో పాటు డైరెక్టర్ గణేశ్‌రావు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఎఫ్ సిబ్బంది శ్రీనివాస్, శ్రీకాంత్, నాగార్జున డెయిరీ ఏజీఎం ఆకునూరి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

హుజూరాబాద్ టౌన్, మార్చి 27: నీటిని పొదుపుగా వాడుకోవాలని సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ సూచించారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వివిధ శాఖల అధికారులు, సామాజిక వేత్తలు ప్రజలకు నీటి వృథాపై అవగాహన కల్పించి, తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సభ్యుల సహకారంతోనే సంఘం అభివృద్ధి

సైదాపూర్, మార్చి 27: సభ్యుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని సింగిల్ విండో చైర్మన్ కొత్త తిరుపతి రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు రుణాలతో పాటు ఎల్‌టీ లోన్లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలి

శంకరపట్నం, మార్చి 27: రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి దోహదపడాలని తాడికల్ సింగిల్ విండో చైర్మన్ కేతిరి మధుసూదన్‌రెడ్డి కోరారు. స్థానిక సింగిల్ విండో కార్యాలయ ఆవరణలోబుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంఘం అభివృద్ధికి పాలకవర్గం చేపడుతున్న చర్యలను వివరించారు. సీఈవో కొర్మి వీరస్వామి సంఘం వార్షిక నివేదికను చదివి వినిపించారు. వైస్ చైర్మన్ నరహరి వెంకటరమణారెడ్డి, డైరెక్టర్లు తిరుపతి, సమ్మయ్య, దొంగల రాములు, కలకుంట్ల సత్యనారాయణ, మాచర్ల పద్మ, శేశాచారి, జూల శ్రీనివాస్, స్వరూప, శ్రీనివాస్, ప్రవీణ్, హన్మంతరావు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

శంకరపట్నం, మార్చి 27: మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికాభివృద్ధి సాధించాలని మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ శైలజ కోరారు. కరింపేట్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, ఈజీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణులు సైనికుల్లా పని చేయాలి

చిగురుమామిడి, మార్చి 27: కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ హోదా తీసుకువచ్చిన ఘనత వినోద్ కుమార్‌కే దక్కుతుందన్నారు. మండలంలో ఇంటింటా వినోద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకురాలు కల్వల రాజేశ్వరి రెడ్డి ఉన్నారు.

చేనేత రంగం అభివృద్ధికి కృషి

హుజూరాబాద్ టౌన్, మార్చి 27: చేనేత రంగం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు ఎస్ చరణ్ పేర్కొన్నారు. పట్టణంలోని చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం 70వ వార్షిక, 81వ మహాసభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘం అధ్యక్షుడు ఎలిగేటి ఉపేందర్, చేనేత, జౌళి శాఖ అభివృద్ధి అధికారులు వై శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళా

అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ప్రతినిధులు

కమాన్‌చౌరస్తా, మార్చి 27: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు భారీ స్పందన లభించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి శ్రీలక్ష్మి, కళాశాల టాస్క్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ శోభారాణి మాట్లాడుతూ, ఉద్యోగ మేళాకు 358 మంది అభ్యర్థులు హాజరు కాగా, పలు దశల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి 121 మందికి ఆఫర్ లెటర్లు అందజేసినట్లు తెలిపారు. మరో 100 మందిని షార్ట్‌లిస్ట్ చేసినట్లు వివరించారు. అలాగే, శాతవాహన విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు ప్లేస్‌మెంట్ కన్వీనర్ డాక్టర్ మనోహర్ పేర్కొన్నారు. ఇందులో ఆక్సిస్ బ్యాంక్, యాక్సెంచర్, పతాంజలి సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో యాక్సిస్ బ్యాంక్‌కు 10, యాక్సెంచర్ సంస్థలో 6, పతాంజలిలో 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు.

ఆర్టీసీ సిబ్బందికి పురస్కారాలు ప్రదానం

తెలంగాణచౌక్, మార్చి 27: కరీంనగర్ డిపో-2 లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బుధవారం డీఎం మల్లయ్య ప్రగతి చక్ర అవార్డులను ప్రదానం చేశారు. వినోదబాయ్, రమేశ్, చంద్రయ్య, రాజన్న, డీఎంరెడ్డి, లచ్చయ్యను శాలువాలతో సత్కరించి, ప్రగతి చక్ర పురస్కారాలను అందించారు. అనతంరం విజయలక్ష్మి(ఏటీఎం), తిరుపతి (ఏఈ) సౌజన్యంతో డిపో సిబ్బందికి డీఎం మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు.

జ్యోతిష్మతిలో ఇన్నోపేస్ట్-2024

తిమ్మాపూర్ రూరల్, మార్చి 27: తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి అటానమస్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ఇన్నోపేస్ట్-2024 కార్యక్రమాన్ని సీనియర్ ప్రొఫెసర్ డా. వీ కామాక్షి ప్రసాద్, జ్యోతిష్మతి విద్యాసంస్థల అధినేత జువ్వాడి సాగర్‌రావు ప్రారంభించారు. కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ జువ్వాడి సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, డీన్ అకాడమిక్ డాక్టర్ వైశాలి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ పీ సంపత్ రావు, కో ఆర్డినేటర్లు డాక్టర్ జగదీశన్, డాక్టర్ మణికందన్, డాక్టర్ పూర్ణచందర్ పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

రాంనగర్, మార్చి 27: రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో సీఐఎస్ఎఫ్ బలగాలతో బుధవారం కవాతు నిర్వహించారు. నగరంలోని తెలంగాణచౌక్ వద్ద ప్రారంభమై ఆర్‌అండ్‌బీ అతిథి గృహం మీదుగా కోర్టు చౌరస్తా నుంచి మంచిర్యాల చౌరస్తా వద్ద ముగిసింది. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సీఐఎస్ఎఫ్ సేవలు వినియోగించనున్నట్లు సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్, కంపెనీ కమాండెంట్ విక్రాంత్, అసిస్టెంట్ కమాండెంట్ విజేందర్, ఇన్‌స్పెక్టర్లు విజయ్‌కుమార్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయ దుకాణాల్లో తనిఖీలు

కార్పొరేషన్, మార్చి 27: నగరంలోని పలు ప్లాస్టిక్ దుకాణాల్లో బుధవారం బల్దియా అధికారులు తనిఖీలు చేపట్టారు. నిషేధిత ప్లాస్టిక్‌ను సీజ్ చేసి, వ